చట్టాలున్నా.. అమలు బాధ్యత ప్రభుత్వానిదే

- న్యాయ పరమైన సమస్యలపై హైడ్రా వర్క్‌షాప్
- చెరువులు, ప్రభుత్వ భూముల పరిరక్షణపై న్యాయ నిపుణుల కీలక సూచనలు

హైడ్రా కార్యాలయంలో న్యాయ నిపుణులతో వన్‌డే వర్క్‌షాప్ నిర్వహిస్తున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్, చిత్రంలో తదితరులు

సిటీబ్యూరో, డిసెంబర్ 21(నమస్తే తెలంగాణ): చెరువుల పరిరక్షణ, ప్రభుత్వ భూముల పరిరక్షణకు సంబంధించి చట్టాలున్నప్పటికీ వాటిని పటిష్టంగా అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపైనే ఉంటుంది.., చెరువులు, ప్రభుత్వ భూముల ఆక్రమణలు, అనుమతి లేని లే ఔట్లలోని ఇంటి స్థలాలను రిజిస్ట్రేషన్ చేయడానికి అవకాశం లేని వ్యవస్థ రావాలని, మాస్టర్ ప్లాన్‌లోప్రజా అవసరాలకు ఉద్దేశించిన స్థలాలు దుర్వినియోగమైతే నేరుగా చర్యలు తీసుకోవచ్చని పలువురు న్యాయ నిపుణులు అభిప్రాయపడ్డారు. శనివారం బుద్ధ భవన్‌లోని హైడ్రా కార్యాలయంలో చెరువుల పరిరక్షణ, ప్రభుత్వ భూములను కాపాడటంలో తలెత్తుతున్న ఇబ్బందులు, న్యాయపరమైన అంశాలలో ఎలాంటి చర్యలు తీసుకోవాలనే విషయాలపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆధ్వర్యంలో 'వర్క్‌షాప్ ఆన్ లీగల్ ఇష్యూస్ పర్టైనింగ్ టు హైడ్రా' వన్ డే వర్క్‌షాప్ నిర్వహించారు. చెరువుల పరిరక్షణ, పునరుజ్జీవనానికి పనిచేస్తున్న హైడ్రాకు ఎల్లప్పుడు న్యాయ సలహాలు అందించడానికి సిద్ధంగా ఉంటామని న్యాయవాదులు రంగనాథ్‌కు చెప్పారు. చెరువులను పునరుద్ధరించడం, వరద కాలువలను సజీవంగా ఉంచడంతోనే నగరానికి వరద ముప్పు తగ్గుతుందని నిపుణులు సూచించారు. గొలుసుకట్టు చెరువులు లింక్ తెగిపోవడంతో రెండు సెంటిమీటర్లు దాటి వర్షం పడితే నగర రహదారులు, లోతట్టు ప్రాంతాలు నీట మునుగుతున్నాయని నిపుణులు చెప్పారు. ప్రభుత్వ శాఖల మధ్య హైడ్రా సమన్వయం చేసినప్పుడే నగరంలో వరద ముప్పు నివారించే అవకాశం ఉంటుందని వారు రంగనాథ్‌కు చెప్పారు. చెరువు శిఖం భూముల విషయంలో పైవేటు పట్టాలున్న వారు వ్యవసాయం మాత్రమే చేసుకోవాలని మరే ఇతర హక్కులు ఉండవని చెప్పారు. చెరువుల మధ్య నుంచి పలుచోట్ల రహదారులు నిర్మించారని, అయితే, ఇరువైపులా నీటికి అడ్డు లేకుండా పైవంతెనలు కడితే బాగుంటుందన్నారు. చెరువుల బఫర్ జోన్లలో మట్టితో నింపేసి, వారి స్థలం ముంపు ప్రాంతంలో లేదని చూపించే ప్రయత్నాలను ఎన్ఆర్ఎస్ఏ, సర్వే ఆఫ్ ఇండియా, గ్రామీణ మ్యాప్‌ల ద్వారా నివారించవచ్చన్నారు. హెచ్ఎండీఏ పరిధిలోకి గ్రామాలు చేరినప్పుడు గ్రామ పంచాయతీ లేఔట్లు ఎట్టి పరిస్థితుల్లోనూ చెల్లవని వారు స్పష్టం చేశారు. లే ఔట్లలో 30 శాతం భూమిని ప్రజావసరాల కోసం కేటాయించాల్సి ఉంటుందని, అనుమతి పొందిన లే ఔట్‌ను అతిక్రమించి నిర్మాణాలు చేపడితే చట్టం ప్రకారం, కూల్చివేయవచ్చని వర్క్‌షాప్‌లో న్యాయ నిపుణులు అభిప్రాయపడ్డారు. ఈ వర్క్‌షాప్‌లో హైకోర్టు సీనియర్ న్యాయవాది రేసు మహేందర్ రెడ్డి, జీహెచ్ఎంసీ, హైడ్రా స్టాండింగ్ కౌన్సిల్ కె.రవీందర్ రెడ్డి, అసిస్టెంట్ స్టాండింగ్ కౌన్సిల్ సీహెచ్ జయకృష్ణ, రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ ఎన్.శ్రీనివాసరావు, సీసీఎల్ఏ రిటైర్డ్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మధుసూదన్, ప్రో. పి.రాజ్‌గోపాల్‌తో పాటు పలువురు సీనియర్ న్యాయవాదులు, వివిధ శాఖలకు చెందిన నిపుణులు పాల్గొన్నారు.

ప్రజా ప్రభుత్వం కాదు.. కమీషన్ల ప్రభుత్వమిది

బీసీలకు అన్యాయం చేస్తే రేవంత్ రెడ్డిని తరిమి కొడతాం

రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య

మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య, తదితరులు

కాచిగూడ, డిసెంబర్ 21: సీఎం రేవంత్ రెడ్డిది ప్రజా ప్రభుత్వం కాదని, కమీషన్ల ప్రభుత్వమని రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ఆరోపించారు. తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రసిడెంట్ పిల్లుట్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో కాచిగూడలోని అభినందన్ హోటల్‌లో బీసీ సంఘాల నాయకులతో శనివారం సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆర్.కృష్ణయ్య హాజరై మాట్లాడారు. బీసీలకు అన్యాయం చేస్తే రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని తరిమికొడతామని హెచ్చరించారు. సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం, బీసీ కార్పొరేషన్ ద్వారా ప్రతి బీసీ కుటుంబానికి రూ.10 లక్షలను 90 శాతంతో సబ్సిడీ రుణాలను ఇచ్చి, మాట నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. తెలంగాణ వ్యాప్తంగా ఉన్న 12 కుల ఫెడరేషన్లను కార్పొరేషన్లుగా మార్చాలని, అదే విధంగా ప్రతి కార్పొరేషన్‌కు చైర్మన్, పాలక మండలిలను ఏర్పాటు చేయాలని సూచించారు. మారుతున్న సమాజంలో బీసీలు ఆర్థికంగా ఎదగడానికి బీసీ కార్పొరేషన్ ద్వారా నిరంతరం రుణాలు అందజేయాలని కోరారు. రాష్ట్రంలోని గురుకుల పాఠశాలలకు సొంత భవనాలకు నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నీలం వెంకటేశ్, అంజి, వేముల రామకృష్ణ, నందగోపాల్, సతీశ్, ఉదయ్, లింగం యాదవ్, రామ్‌దేవ్ యాదవ్, సత్యనారాయణ, రవి యాదవ్, తదితరులు పాల్గొన్నారు.



భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు వీడ్కోలు పలుకుతున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

ముగిసిన రాష్ట్రపతి శీతకాల విడిది

వీడ్కోలు పలికిన గవర్నర్, జిష్ణుదేవ్ శర్మ, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

మేడ్చల్, డిసెంబర్ 21(నమస్తే తెలంగాణ): భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శీతకాల విడిది ముగించుకుని శనివారం ఢిల్లీ బయల్దేరారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని హకీంపేట్ విమానాశ్రయంలో తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, రాష్ట్ర మంత్రి సీతక్క, ప్రభుత్వ ప్రత్యేక సలహాదారు వేణుగోపాల్ రావు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంత కుమారి, మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్‌లు ఘనంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు వీడ్కోలు పలికారు. శీతాకాల విడిదికే మంగళవారం వచ్చిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శనివారం పర్యటన ముగించుకుని వెళ్లిపోయారు.

ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డికి సన్మానం చేస్తున్న రేషన్ డీలర్లు

రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరిస్తాం

ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

మల్కాజిగిరి, డిసెంబర్ 21: రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరిస్తామని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించడానికి అసెంబ్లీలో ఎమ్మెల్యే మాట్లాడిన సందర్భంగా ఆయనకు రేషన్ డీలర్లు బోయిన్‌పల్లిలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శనివారం సన్మానం చేశారు. కార్యక్రమంలో సంతోష్ కుమార్, రమేశ్, అశుతోష్, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదల గుండెల్లో హైడ్రా గుబులు

- నిద్రలేని రాత్రులు గడుపుతున్న అభాగ్యులెందరో..!
- ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

దుండిగల్, డిసెంబర్ 21: హైడ్రా పేరుతో పేద ప్రజలు నిద్రలేని రాత్రులు గడుపుతున్నారని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్సీ, మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు శంభీపూర్ రాజు అన్నారు. శనివారం జరిగిన శాసన మండలి సమావేశాలల్లో ఎమ్మెల్సీ రాజు హైడ్రా ఏర్పాటుపై గళమెత్తారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన అనంతరం, ఏర్పాటైన హైడ్రా ఎప్పుడు, ఏ క్షణం వచ్చి పేదల ఇండ్లను కూల్చివేస్తుందో..! అనే ఆందోళనలో ప్రజలు నిద్రలేకుండా గడుపుతున్నారన్నారు. కరోనా వచ్చినప్పుడు ప్రపంచం ఏరకంగా భయపడిందో, హైడ్రా వచ్చినప్పటి నుంచి హైదరాబాద్ నగర ప్రజలు భయాందోళనల మధ్య బ్రతుకాల్సిన పరిస్థితి దాపురించిందన్నారు. ఇరిగేషన్, హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ అనుమతులతో నిర్మించుకున్న భవనాలను సైతం ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా కూల్చివేస్తూ నిర్దాక్షిణ్యంగా వ్యవహరిస్తుందన్నారు. పేదలు, ధనికులు, సెలబ్రిటీలు అనే తారతమ్యం లేకుండా అన్ని వర్గాల ప్రజలు హైడ్రాతో ఆందోళన చెందుతున్నారన్నారు. శని, ఆదివారాలను మాత్రమే హైడ్రా అధికారులు ఎంపిక చేసుకుని కూల్చివేతలు చేపట్టడాన్ని ఆయన ఆక్షేపించారు. ఆయా రోజుల్లో కోర్టులు పనిచేయని రోజులను ఎంపిక చేసుకుని కూల్చివేతలు చేపుడుతున్నారన్నారు. అసలు హైడ్రాకు చట్టబద్ధత ఉందా? హైడ్రా రాగానే రాత్రికి రాత్రి కూల్చిన ఇండ్లు ఎన్ని? బాధితులకు పరిహారం ఎవరు ఇస్తరు? పోయిన ప్రాణాలకు ఎవరు బాధ్యత వహిస్తరు? హైడ్రా కమిషనరా? ప్రభుత్వమా? అని ఆయన ప్రశ్నించారు. హైడ్రాకు ఉన్న హక్కేమిటో...? అధికారమేమిటో.. తెలియకుండానే ఎలక్ట్రానిక్ మీడియాల్లో కమిషనర్ ఇంటర్వ్యూలు ఇస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేశారన్నారు. ప్రభుత్వం, హైడ్రా అధికారుల నిర్వాహకంతో నిర్మాణ రంగం కుదేలైందని, వేలాది కుటుంబాలు బజారుకు ఈడ్చేసిందని పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేండ్ల కాలంలో హైదరాబాద్‌ను విశ్వనగరంగా రూపొందిస్తే హైడ్రా అనే భూతం కారణంగా, పేదల ఇండ్లను రాత్రికి రాత్రే కూలగొట్టిన వారు, పెద్దల విషయంలో నోటీసులతో సరిపెడుతున్నారన్నారు. ముఖ్యమంత్రి సోదరుడి ఇంటిని మాత్రం కూల్చకుండా నోటీసులిచ్చి చేతులు దులుపుకోవడమేమిటి? అని ప్రశ్నించారు. బ్యాంకుల్లో రుణం పొంది, అన్ని శాఖల అనుమతులు పొందిన ఇండ్లను కూలగొడుతుండటంతో మధ్య తరగతి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. నష్టపోయిన బాధితులకు సీఎం పరిహారమిస్తారా? హైడ్రా కమిషనర్ ఇస్తారా? తెలియజేయాలన్నారు.

వైభవం షాపింగ్ మాల్ ప్రారంభం

కొత్తపేటలో సినీనటి శ్రీలీల సందడి

ఆర్కేపురం, డిసెంబర్ 21: నగరంలోని కొత్తపేటలో నూతనంగా ఏర్పాటు చేసిన వైభవం షాపింగ్ మాల్‌ను చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై తెలంగాణ రాష్ట్ర రోడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, ఆర్కేపురం డివిజన్ కార్పొరేటర్ రాధా ధీరజ్ రెడ్డితో కలిసి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వైభవం మాల్ ఎండీ వలస చలపతి, ఆఫ్తాబ్ అహ్మద్ ఆఫర్లు ప్రకటించడంతో కొనుగోలుదారులతో షాపింగ్ మాల్ సందడిగా మారింది.

రెవా యూనివర్సిటీలో అంతర్జాతీయ విద్యా ప్రమాణాల వ్యాప్తి

సిటీబ్యూరో, డిసెంబర్ 21(నమస్తే తెలంగాణ): గ్లోబలైజేషన్ నేపథ్యంలో సొసైటీలో హయ్యర్ ఎడ్యుకేషన్‌లో నాణ్యత కోసం అవసరమైన విజ్ఞానం, భౌగోళిక పరిస్థితులకు అనుగుణంగా రెవా యూనివర్సిటీ అధ్వర్యంలో కొనసాగుతున్న రెవా ఇంటర్నేషనల్ రిలేషన్స్ అండ్ రీసెర్చ్ కొలాబోరేషన్స్ సెంటర్ గ్లోబల్ సంబంధాలను కొనసాగిస్తోంది. రెవా అధ్వర్యంలో ఐఆర్ఆర్‌సీ అంతర్జాతీయ విద్యా ప్రమాణాలతో పాటు పలు దేశాల ప్రముఖ విద్యా సంస్థల భాగస్వామ్యంతో విద్యార్థులను అకాడమిక్స్, రీసెర్చ్, పబ్లికేషన్స్ అంశాలలో సక్సెస్ అయ్యే ప్రణాళికతో ముందుకెళ్తోంది. యూఎస్, యూకే, యూరప్, ఆస్ట్రేలియా, జపాన్, వియత్నాం, సౌత్ కొరియా, మలేషియా, జర్మనీ, అరేబియన్ దేశాలతో పాటు పలు దేశాలలోని ప్రముఖ విద్యా సంస్థలతో రెవా యూనివర్సిటీ రీసెర్చ్ పాట్నర్‌షిప్ కొనసాగిస్తున్నది. తమ సంస్థకు చెందిన ఇంజనీరింగ్ విద్యార్థులను యూకే, రష్యా, డెన్మార్క్, తైవాన్ తదితర దేశాల్లోని ప్రఖ్యాత యూనివర్సిటీలలో ఇంటర్న్‌షిప్ చేసేలా ప్రోత్సహించింది. ఇందుకు రెవా ఇంటర్నేషనల్ స్టూడెంట్ అసోసియేషన్ విద్యార్థులకు, యూనివర్సిటీలకు మధ్య వేదికగా వ్యవహరిస్తోంది. రెవా ఐఆర్ఆర్‌సీ ఆసక్తి ఉన్న విద్యార్థులను అంతర్జాతీయ స్థాయిలో నిపుణులుగా తీర్చిదిద్దే ఛాలెంజ్‌తో గ్లోబల్ సంబంధాలు కొనసాగిస్తూ తమ ప్రత్యేకతను చాటుకుంటోంది.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

- సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ ఏ.శ్రీదేవసేన
- మారేడ్‌పల్లి పాలిటెక్నిక్ కళాశాలలో ఆడిటోరియాన్ని ప్రారంభించిన కమిషనర్

మారేడ్‌పల్లి పాలిటెక్నిక్ కళాశాలలో జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ శ్రీదేవసేన

మారేడ్‌పల్లి, డిసెంబర్ 21: విద్యార్థులు విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ ఏ.శ్రీదేవసేన అన్నారు. మారేడ్‌పల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఎలక్ట్రానిక్ విభాగం (జీఐఓఈ) ఆవరణలో 1987 బ్యాచ్ అలూమ్నీ అడహక్ కమిటీ ఆధ్వర్యంలో పూర్వ విద్యార్థులు సుమారు రూ.70 లక్షల వ్యయంతో సకల సౌకర్యాలతో పునర్ నిర్మించిన విజ్ఞాన వేదిక అడిటోరియంను కమిషనర్ దేవసేన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు, కళాశాల ప్రిన్సిపాల్ అన్నపూర్ణతో కలిసి కమిషనర్ శ్రీదేవసేన జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం, కమిషనర్ మాట్లాడుతూ, మారేడ్‌పల్లిలోని పాలిటెక్నిక్ కళాశాల ఎంతో మంది విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడం జరిగిందన్నారు. ప్రస్తుతం, వారు ఆయా రంగాల్లో ఉన్నత స్థానాల్లో ఉంటూ, సేవలను అందిస్తున్నారని చెప్పారు. పూర్వ విద్యార్థులందరిని ఆదరంగా తీసుకొని ప్రతి విద్యార్థి కష్టపడి చదువుకొని తల్లిదండ్రులకు, గురువులకు, కళాశాలకు పేరు, ప్రఖ్యాతలను తీసుకు రావాలన్నారు. మన సంస్కృతి, చరిత్ర, దేశం పట్ల గౌరవం కల్గి ఉండాలని తెలిపారు. వీలైనంత వరకు మన దేశంలోనే ఉండి మన దేశానికి సేవ చేయాలని సూచించారు. మాతృ సంస్థ పట్ల ఎంతో అభిమానంతో ఆడిటోరియం పునర్నిర్మాణంలో భాగస్వాములైన పూర్వ విద్యార్థులందరిని కమిషనర్ అభినందించారు. కార్యక్రమంలో ఎస్‌బీటీఈటీ కార్యదర్శి ఏ.పుల్లయ్య, అడహక్ కమిటీ సభ్యులు రాంబాబు, చందు, రమేశ్, చంద్రశేఖర్, కుమార్, జగదీశ్, తాతారావు పాల్గొన్నారు.

ఘట్‌కేసర్‌లో కొనసాగుతున్న కూల్చివేతలు

ఘట్‌కేసర్‌లో కూల్చివేతలు జరుపుతున్న రెవెన్యూ సిబ్బంది

ఘట్‌కేసర్ రూరల్, డిసెంబర్ 21: ఘట్‌కేసర్ పట్టణంలో కొనసాగుతున్న బ్రిడ్జి నిర్మాణంలో భాగంగా స్థానికంగా కూల్చివేతలూ కొనసాగుతున్నాయి. మండల రెవెన్యూ అధికారులు శనివారం కూల్చివేతలు జరిపారు. ఈ సందర్భంగా స్థలాలు కోల్పోతున్న బాధితులకు నష్ట పరిహారం చెల్లించిన తర్వాతే కూల్చివేతలు జరుపాలని బాధితులు డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారమే కూల్చివేతలు జరుపుతున్నట్లు అధికారులు వెల్లడించారు.

సమస్యకు పరిష్కారమే లేదు.. అయినా బెదిరింపులు..!

ఘట్‌కేసర్‌లో బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తి చేయాలని బీఆర్ఎస్, బీజేపీలు ముందుండి ఉద్యమాన్ని నడిపించాయని, అది గిట్టని మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి తోటకూర వజ్రేశ్ యాదవ్‌లు ప్రతి పక్ష పార్టీలను విమర్శించటం ఎంత వరకు సమంజసమని మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్ రెడ్డి తెలిపారు. ఘట్‌కేసర్ ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఆయన మాట్లాడుతూ, ఐదేండ్లు మేడ్చల్ ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు సుధీర్ రెడ్డికి చేత కాలేదని, ఒక్కసారి సర్పంచ్‌గా కూడా గెలువకుండా ఏ అధికారం లేకుండా అధికారిక కార్యక్రమాలలో పాల్గొంటున్న వజ్రేశ్ యాదవ్‌లు విమర్శించటం సిగ్గుచేటన్నారు. కాంట్రాక్టర్‌కు డబ్బులు ఇప్పించలేని నాయకులకు రిలే నిరాహార దీక్షకు మద్దతు యిచ్చిన పార్టీలను విమర్శించే నైతిక హక్కు లేదన్నారు. ఇకనైనా బ్రిడ్జి నిర్మాణం సకాలంలో పూర్తి చేయాలని, భూ బాధితులకు వెంటనే నష్ట పరిహారం చెల్లించేలా చర్యలు చేపట్టాలన్నారు. లేనిచో మరల ఉద్యమాన్ని ప్రారంభిస్తామన్నారు. ఘట్‌కేసర్ పట్టణంలో రోడ్డు విస్తరణలో భాగంగా శనివారం కూల్చివేతలు జరిపారు. నష్ట పరిహారం చెల్లించకుండా కూల్చివేతలు జరపటంపై మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్ రెడ్డి విమర్శించారు.

సమస్యలపై అసెంబ్లీలో చర్చించాలని ఎమ్మెల్యే కూనంనేనికి వినతి పత్రమిస్తున్న గీత కార్మికులు

గీత కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

తెలంగాణ గీత పని వారల సంఘం

హిమాయత్‌నగర్, డిసెంబర్ 21: రాష్ట్రంలోని గీత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ గీత పని వారల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మగాని ప్రభాకర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డీజీ సాయిలు గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హిమాయత్‌నగర్‌లోని గీత పనివారల సంఘం కార్యాలయంలో వారు మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వం ప్రారంభించిన స్కిల్ యూనివర్సిటీలో గీత వృత్తి పరిశ్రమ అభివృద్ధి, ఉపాధి శిక్షణ కోర్సులను ప్రవేశపెట్టాలన్నారు. గీత వృత్తిదారులు ప్రమాదవశాత్తు మరణిస్తే వారి కుటుంబంలో ఒకరికి పెన్షన్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. గీత కార్మికుల సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని కోరారు.

సాహితీ పరిణతి మూర్తీభవించిన వ్యక్తిత్వం రమాదేవిది

తెలంగాణ సాహిత్య అకాడమీ పూర్వ అధ్యక్షుడు డాక్టర్ నందిని సిధారెడ్డి

తెలుగు యూనివర్సిటీ, డిసెంబర్ 21: తెలంగాణ రచయితల సంఘం వరంగల్ - జంట నగరాల శాఖల సంయుక్త ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ ఆడిటోరియంలో ప్రముఖ రచయిత్రి నెల్లుట్ల రమాదేవి రచించిన పుస్తకాల ఆవిష్కరణ శనివారం జరిగింది. అశ్రువర్ణం కవితా సంపుటిని ఆవిష్కరించిన అనంతరం, తెలంగాణ సాహిత్య అకాడమీ పూర్వ అధ్యక్షులు డాక్టర్ నందిని సిధారెడ్డి ప్రసంగించారు. సాహిత్యంలో పరిణతి సాధించి మూర్తీభవించిన వ్యక్తిత్వం రమాదేవిది అని అన్నారు. సమాజంలో మానవీయ కోణం లోపిస్తున్న ప్రస్తుత తరుణంలో తన కవితల ద్వారా మానవీయ దృక్పథాన్ని చాటారని పేర్కొన్నారు. భావుకతతో మంచి కథలు రచించారని ఆయన ప్రశంసించారు. భాషా పదజాల నైపుణ్యత కవితలు అశ్రవర్ణం చదివినప్పుడు కనిపిస్తాయని రమాదేవి రచనా శైలిని సిధారెడ్డి కొనియాడారు. ప్రముఖ కవి, రచయిత, స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి ఈ సందర్భంగా రమాయణం-1 కాలమ్స్ సంపుటిని ఆవిష్కరించి మాట్లాడారు. బహుముఖీన అంశాలతో రమాదేవి కాలమ్స్ ఉన్నాయన్నారు. పాఠకుల హృదయాలను తాకేలా రమాయణం రచించారని ఆయన ప్రశంసించారు. తెలంగాణ రచయితల సంఘం వరంగల్ అధ్యక్షులు పొట్లపల్లి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రముఖ రచయిత్రులు డాక్టర్ అమృతలత, డాక్టర్ కొండపల్లి నిహారిణి, కిరణ్ బాల పాల్గొన్నారు.

నెల్లుట్ల రమాదేవి రచించిన పుస్తకాల ఆవిష్కరణలో డాక్టర్ నందిని సిధారెడ్డి, ఏనుగు నరసింహారెడ్డి

మయూఖ సంకలనం భావితరాలకు ఓ నిధి

తెలుగు విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య నిత్యానందరావు

ప్రముఖ రచయిత్రి, కవయిత్రి, మయూఖ, తరుణి అంతర్జాల పత్రికల సంపాదకురాలు డాక్టర్ కొండపల్లి నిహారిణి సంపాదకత్వంలో క్రోఢీకరించిన 44 మంది సాహితీవేత్తల ఇంటర్వ్యూల సంకలనం మయూఖ ముఖాముఖి పుస్తకాల ఆవిష్కరణ సభ జరిగింది. ప్రముఖ కవి, తెలంగాణ రచయితల సంఘం జంట నగరాల శాఖ అధ్యక్షులు కందుకూరి శ్రీరాములు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మయూఖ ముఖాముఖి-1, 2 పుస్తకాలను పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు ఆచార్య వెల్దండ నిత్యానందరావు ఆవిష్కరించారు. అనంతరం నిత్యానందరావు మాట్లాడుతూ 44 మంది సాహితీ ప్రముఖుల ఇంటర్వ్యూలు సమీకరించడం ఎంతో కష్టమైన పని అన్నారు. ప్రముఖ కవి, రచయిత, స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి, ప్రముఖ రచయిత్రి డాక్టర్ కొల్లాపురం విమల, రచయిత వేణు నక్షత్రం పాల్గొన్నారు.

సఫాయి కర్మాచారిల సమస్యలు పరిష్కరించాలి

జాతీయ ఎస్సీ, ఎస్టీ సఫాయి కర్మాచారి కమిషన్ చైర్మన్ ఎం.వెంకటేసన్

సమావేశంలో సమస్యలు తెలుసుకుంటున్న జాతీయ ఎస్సీ, ఎస్టీ సఫాయి కర్మాచారి కమిషన్ చైర్మన్ ఎం.వెంకటేసన్

మేడ్చల్ కలెక్టరేట్, డిసెంబర్ 21: సఫాయి కర్మాచారిల సమస్యలను వెంటనే పరిష్కరించాలి, వారికి ఇబ్బందులు కలుగకుండా మర్యాదతో, గౌరవపంతంగా వారితో మసలు కోవాలని జాతీయ ఎస్సీ, ఎస్టీ సఫాయి కర్మాచారి కమిషన్ చైర్మన్ ఎం.వెంకటేషన్ అధికారులను ఆదేశించారు. మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో శనివారం సఫాయి కర్మాచారి జిల్లా స్థాయి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సమావేశానికి విచ్చేసిన సఫాయి కర్మాచారిల సమస్యలను కమిషన్ చైర్మన్ అడిగి తెలుసుకున్నారు. అనంతరం, ఆయన మాట్లాడుతూ సఫాయి కర్మాచారిలకు సమస్యలుంటే ముందుగా అధికారులకు తెలియజేయాలని, పరిష్కారం కాకుంటే యూనియన్ దృష్టికి తేవాలని, అక్కడ కూడా పరిష్కారం కాకుంటే కమిషన్ ఫోన్ నం.01124648924కు ఫిర్యాదు చేయాలని సూచించారు. యూనిఫాం, ఐడీ కార్డులు, నెలలో 4 రోజులు సెలవులు వంటి హక్కులను తెలియజేస్తూ, నెలకొక సారి వారిని కలసి సమస్యలను తెలుసుకోవాలని లేబర్ కమిషనర్‌ను ఆదేశించారు. జిల్లా ఎస్సీ సంక్షేమ అధికారి వినోద్ కుమార్, ఇన్‌చార్జి ఆర్డీవో శంకర్ కుమార్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మోజెస్ బాబు పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్ అపహరిస్తూ పట్టుబడిన దంపతులు

నిందితులు గణపురం నిఖిల్, శ్వేత

రామన్నపేట, డిసెంబర్ 21 : గ్యాస్ సిలిండర్ అపహరిస్తూ దంపతులు పట్టుబడ్డారు. ఎస్ఐ మల్లయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ మండలం అన్నోజిగూడెం గ్రామానికి చెందిన గణపురం నిఖిల్, అతని భార్య శ్వేత రామన్నపేట మండలంలోని బోగారం గ్రామ శివారులో అయ్యప్ప స్వామి దేవాలయంలోని గ్యాస్ సిలిండర్‌ను దొంగిలించారు. అనంతరం సిలిండర్‌ను తీసుకు వెళ్తుండగా గ్రామానికి చెందిన కూనూరు వెంకటేశ్, మేడి వెంకటేశ్ గమనించి ఆరా తీస్తుండగా పారిపోవడానికి ప్రయత్నించారు. దాంతో పోలీసులకు సమాచారం అందించారు. వారిని పోలీసులు పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. వెంకటేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అశోక్‌కు బీఆర్ఎస్ నాయకుల పరామర్శ

ఆత్మకూరు(ఎం), డిసెంబర్ 21 : మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ కార్యకర్త గట్టు అశోక్ రెండ్రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. హైదరాబాద్‌లోని ఓ దవాఖానలో చికిత్స పొందుతున్న అశోక్‌ను మాజీ ఎంపీటీసీ యాస కవిత శనివారం పరామర్శించి రూ.5వేల